సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



బడుగుల ఆశాజ్యోతి.. పూలే

మహాత్మా జ్యోతీరావుపూలే బడుగులు ఆశాజ్యోతి అని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కొనియాడారు.

- 8లో..



సంక్షేమ లబ్ధిదారులే నా సైన్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అందజేశారని మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35/27

వాతావరణం

వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతో భక్తిభావం వెల్లివిరిసింది. సంప్రదాయ వస్త్రధారణలో ఈద్గాల వద్దకు చేరుకున్న ముస్లింలతో మత పెద్దలు ప్రార్థనలు చేయించారు. రంజాన్ ఉపవాస దీక్షలను విరమించారు. ఒంగోలులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, సింగరాయకొండ, టంగుటూరులో మంత్రి ఆదిమూలపు సురేష్ ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



సింగరాయకొండలో ముస్లింలతో కలిసి రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్



ఒంగోలులో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



ఒంగోలులో ఈద్గా వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

అబద్ధాలు C/O దామచర్ల

ఒంగోలు నగరంలో టీడీపీ నేతలు బరితెగించారు. తప్పులు చేయడం.. ఆ నెపాన్ని అధికార వైఎస్సార్ సీపీపై నెట్టేయడం వారికి రివాజుగా మారింది. ప్రశాంతంగా సాగుతున్న ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అండ్ కో అలజడి సృష్టించారు. పక్కా ప్లాన్ ప్రకారం అధికార వైఎస్సార్ సీపీ ప్రచారాన్ని అడ్డుకునేందుకు పన్నాగం పన్నారు. అది బెడిసికొట్టేసరికి ఎదురుదాడికి దిగారు. బుధవారం రాత్రంతా హంగామా సృష్టించారు. ఓటమి భయంతో అసలు విషయాన్ని పక్కదోవ పట్టించేలా పచ్చమీడియాను అడ్డం పెట్టుకుని వాస్తవాలు వక్రీకరిస్తూ రెచ్చిపోయారు. మహిళ అని చూడకుండా ప్రచారాన్ని అడ్డుకోవడమే కాకుండా నగరంలో భయానక వాతావరణాన్ని సృష్టించారు. అసలు జరిగిందేమిటి..వారు ప్రచారం చేస్తున్నదేమిటి..? అని తెలుసుకుని ప్రజలే వారిని ఈసడించుకుంటున్నారు.

- చేసిందొకటి.. చెప్పేదొకటి
- దామచర్ల అండ్ కో అడ్డగోలుగా అబద్ధాలు
- పచ్చమీడియా అండతో అసత్య ప్రచారం
- వైఎస్సార్ సీపీ ప్రచారం వద్దకు వచ్చి మరీ రచ్చ
- బాలినేని కోడలు శ్రీకావ్య ప్రచారాన్ని అడ్డుకుని..
- కమ్మపాలెం ఘటనను రిపీట్ చేసిన దామచర్ల



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు డివిజన్లలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. బాలినేని హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఎన్నికల్లో గెలిపించాలని కోరుతున్నారు. బాలినేని సతీమణి శచీదేవి, కుమారుడు ప్రణీత్‌రెడ్డి, కోడలు శ్రీకావ్య ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా శ్రీకావ్య బుధవారం రాత్రి 37వ డివిజన్ పరిధిలోని సమతానగర్‌లో పర్యటిస్తున్నారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తుంటే పక్కా ప్లాన్ ప్రకారం భగ్నం చేసేందుకు టీడీపీ నేతలు కుట్రపన్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ వైఎస్సార్ సీపీ కేడర్‌ను రెచ్చగొట్టారు. వివాదం పెద్దది కావడంతో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దామచర్ల జనార్దన్ వాస్తవాలను వక్రీకరిస్తూ నాటకానికి తెరతీశారు. అధికార పార్టీ వారు ప్రచారం చేస్తున్న ప్రాంతానికి టీడీపీ నాయకులు పోవాల్సిన అవసరం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జరిగిందంతా చూస్తుంటే ముందస్తుగానే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారానికి వస్తున్నారని తెలుసుకుని హిమశ్రీ నిలయం అపార్ట్‌మెంట్‌లోని టీడీపీ కార్యకర్తలతో రెచ్చగొట్టే కార్యక్రమానికి దామచర్ల పథక రచన చేసినట్లు తెలుస్తోంది. పరామర్శ పేరుతో బుధవారం రాత్రి రిమ్స్ ఆస్పత్రికి దామచర్ల వచ్చారు. అక్కడ చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై బెదిరింపులకు దిగారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాలినేని, ఆయన అనుచరులు పెద్ద ఎత్తున రిమ్స్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే ఆస్పత్రి వద్దకు పోలీసు బలగాలు చేరుకున్నాయి. బాలినేని పూర్తి సంయమనం పాటించారు. పోలీసులకు సహకరించి బయటే ఉండిపోయారు. రాత్రంతా ఇలా హంగామా సృష్టించి గురువారం పాత గుంటూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ ముందు అసలు సమతానగర్‌లో బాలినేని కోడలు ప్రచారం చేస్తున్నట్లు తనకు తెలియనే తెలియదంటూ దామచర్ల బుకాయించారు. ఇదంతా చూస్తుంటే 2019 ఎన్నికల సమయంలో జరిగిన సంఘటన గుర్తుకురాక మానదు. కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో కమ్మపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభానికి వెళ్తున్న బాలినేనిని పథకం ప్రకారం అడ్డుకుని నానా యాగీ చేశారు. ముందురోజు రాత్రి టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ఉసిగొల్పి రెచ్చగొట్టించారు. మరుసటిరోజు మీడియా సమావేశంలో పచ్చి అబద్ధాలు చెప్పారు. తాను చేసిన తప్పును కప్పి పుచ్చుకుంటూ ఆ నెపాన్ని ప్రత్యర్థి పార్టీ నాయకుడు బాలినేని మీదకు తోసే ప్రయత్నం చేశారు. సరిగ్గా ఐదేళ్ల తర్వాత ఎన్నికల వేళ అదే తరహా నాటకానికి దామచర్ల తెరతీశారు. అయితే మహిళలు ప్రచారం చేస్తున్నారన్న విషయాన్ని సైతం పట్టించుకోకుండా సమతానగర్ కేంద్రంగా రాజకీయ కుట్రకు తెరతీయడం విమర్శలకు దారితీసింది. దీనికితోడు పచ్చమీడియా సైతం సంఘటన జరిగిన తర్వాత ఏం జరిగిందో తెలియకుండానే అసత్యాలను వండి వార్చేసింది. టీడీపీ నేతల కంటే వారి అనుకూల మీడియా మాత్రం పచ్చపార్టీ నాయకులకు మచ్చ రానీయకుండా తన వంతు ప్రయత్నాలు చేస్తూ అభాసుపాలవుతోంది. దీనంతటిపై ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమతానగర్ ఘటనపై స్పందించాలన్నారు. ఏం జరిగిందో తెలుసుకోకుండా చంద్రబాబు మాట్లాడటం సరికాదన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

దర్యాప్తునకు ఎస్పీ ఆదేశం

- విచారణ అధికారిగా దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ
- జీజీహెచ్‌లో ఘర్షణపై విచారణకు చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్

ఒంగోలు సబర్బన్: నగరంలోని 37వ డివిజన్ సమతానగర్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకున్న ఘటనపై ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ గురువారం విచారణకు ఆదేశించారు. నిష్పక్షపాత, పారదర్శక, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పక పాటించాలని ఎస్పీ కోరారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన, గొడవలు, అల్లర్లకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక పార్టీకి చెందిన వారు ఒంగోలు సమతానగర్ మొదటి లైన్‌లో ఒక అపార్ట్‌మెంట్ వద్ద ప్రచారం చేస్తుండగా మరొక పార్టీకి చెందిన వారితో ఘర్షణకు దారితీసిన ఘటనపై దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీని విచారణ అధికారిగా నియమించామని వెల్లడించారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు విడివిడిగా కేసులు నమోదు చేశామన్నారు. అదేవిధంగా ఒంగోలు జీజీహెచ్‌లో జరిగిన సంఘటనపై డ్యూటీ డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేశామన్నారు. జీజీహెచ్‌లో జరిగిన ఘటనపై చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్‌ను విచారణ అధికారిగా నియమించామన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణానికి ఎటువంటి భంగం కలగకుండా రాజకీయ పార్టీలు ప్రవర్తించాలని సూచించారు. అల్లర్లు సృష్టించినా, గొడవలకు ప్రేరేపించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

అసలు జరిగింది ఇదీ...

- సమతానగర్ ఘటనపై బాలినేని శ్రీకావ్య

ఒంగోలు: పార్టీ ఏదైనా తోటి మనిషి పట్ల సంస్కారవంతంగా వ్యవహరించడం ఎంతో ముఖ్యమని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు బాలినేని శ్రీకావ్య అన్నారు. నగరంలోని 37వ డివిజన్ సమతానగర్ 4వ లైన్‌లో శ్రీకావ్య, మరోచోట బాలినేని శచీదేవి వేర్వేరుగా గురువారం మహిళలతో మమేకం–స్త్రీశక్తితో శచీదేవి కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి జరిగిన సమతానగర్ ఘటనపై బాలినేని శ్రీకావ్య మీడియాతో మాట్లాడారు. తాము ఓట్లు అభ్యర్థించడానికి వచ్చామని, వచ్చిన వారిని అవమానించడం మాత్రం సంస్కారం కాదని అన్నారు. బుధవారం జరిగిన ఘటనలో గేటు వేసి తమను లోపలకు రానివ్వకపోగా తమతో పాటు ఉన్న గర్భిణీ అయిన రాజీనామా చేసిన వలంటీర్‌పై భౌతిక దాడికి పాల్పడ్డారన్నారు. తాము అవతలివైపు ఉన్న నాలుగు ఇళ్లకు వెళ్లి వస్తామని, ఇక్కడే ఉండమని గర్భిణీకి చెప్పామన్నారు. తాము అక్కడకు వెళ్లి వచ్చేసరికి ఆమెతో టీడీపీ వర్గీయులు గొడవపడుతుండటంతో ఎందుకు ఇలా చేస్తున్నారని తాము మాట్లాడామన్నారు. దానికి అవతలి టీడీపీ మహిళ వినలేని, చెప్పలేని బూతు పదజాలంతో మాట్లాడిందని, అవి మహిళలుగా తాము చెప్పలేని పదాలని అన్నారు. చివరకు పైనుంచి వాళ్ల కుమార్తె వీడియో తీస్తుండటంతో.. ఎందుకు తీస్తున్నావని ప్రశ్నించగా, ఆమె మాట్లాడిన మాటలు కూడా తట్టుకోలేకుండా ఉన్నాయన్నారు. విషయం తెలుసుకుని మా వద్దకు వచ్చిన మా మమయ్య బాలినేని శ్రీనివాసరెడ్డికి పూర్తి విషయం చెప్పకుండా తామే సర్దిచెప్పి పంపామన్నారు. కానీ, వారు మళ్లీ తమ పక్కన ఉన్న మహిళల పట్ల కూడా అవమానకరంగా మాట్లాడి రెచ్చగొట్టారన్నారు. వారు వీడియో తీస్తూనే ఉన్నారని, తమను మెట్ల వద్దనే అడ్డుకున్నారని, అలాంటప్పుడు తాము వారుండే పైఅంతస్తులోని ఇంట్లోకి ఎలా వెళ్లగలమని అన్నారు. తమకు ఓటు వేయడం ఇష్టం లేకపోతే ఓటు వేయమని చెప్పినా పర్వాలేదని, కానీ, అసభ్య పదజాలంతో దూషిస్తే మాత్రం సహించమని అన్నారు. మన ఇంటికి వచ్చిన వ్యక్తితో నవ్వుతూ మాట్లాడటం అనేది సంస్కారమని, వైఎస్సార్ సీపీ వాళ్ల ఇళ్లకు కూడా టీడీపీ వారు ఓట్లు అభ్యర్థించేందుకు వెళ్లరా అంటూ శ్రీకావ్య ప్రశ్నించారు. ముందస్తుగా ఒక పథకం ప్రకారమే వాళ్లు ఉద్రిక్తత సృష్టించి దురదృష్టకర ఘటనకు కారణంగా నిలిచారన్నారు. తాను గత కొన్ని నెలలుగా ప్రచారం నిర్వహిస్తున్నా.. ఇటువంటి ఘటన ఎదురుకాలేదన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కారాదనేదే తమ అభిమతమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు గునుపాటి వెంకారెడ్డి, జోనల్, జిల్లా, నగర మహిళా విభాగం అధ్యక్షులు బడుగు ఇందిర, తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, ఆగ్రోస్ డైరెక్టర్ పురిణి ప్రభావతి, సాహిత్య అకాడమీ డైరెక్టర్ బొప్పరాజు జ్యోతి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లీలారాణి, ప్రసన్న, సుధారాణి, బుజ్జి, మాధవీలత, విశాలి, మంజు, ఉమ తదితరులు పాల్గొన్నారు.



సమతానగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాలినేని శ్రీకావ్య

బీసీల జోలికొస్తే ఖబడ్దార్ జనార్దన్

- ఇంటికొచ్చి కొడతానంటే చూస్తూ ఊరుకోం
- ఒకరిని కదిలించి చూడు.. 136 కులాలకు చెందిన వారు నీకు గుణపాఠం చెబుతారు
- బీసీ కులాలను అవమానిస్తే ఫలితం ఎలా ఉంటుందో రుచి చూపిస్తాం
- వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కటారి శంకర్, గోలి తిరుపతిరావు, నాయకులు

ఒంగోలు: బీసీల జోలికొస్తే ఖబడ్దార్ దామచర్ల జనార్దన్ అని వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్ హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతి రావును ఇంటికొచ్చి కొడతానంటే మేమేమన్నా చూస్తూ ఊరుకుంటామా అంటూ శంకర్ మండిపడ్డారు. బీసీ కులాల్లో ఏ ఒక్కరిని కదిలించినా అందుకు తగిన ఫలితం ఎలా ఉంటుందో కూడా రుచి చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించిన మీ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు పట్టినగతే నీకు పడుతుందన్నారు. వైఎస్సార్ సీపీకి మైలేజీ వస్తుందంటే అందుకు కారణం తమ నాయకులు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కారణమన్నారు. అది జీర్ణించుకోలేక ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడటం దురదృష్టకరమని అన్నారు. ఇటువంటి వారికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. కనీసం విషయం తెలుసుకోకుండా నేరుగా వెళ్లి ధర్నాలు చేయడానికి సిగ్గుండాలన్నారు. మహిళలపై భౌతిక దాడికి ఎవరు పాల్పడ్డారనేది తెలుసుకోకుండా నాటకాలు ఆడటం మానుకోవాలని హితవు పలికారు. గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని సైతం బయటకు రండి చంపేస్తామని హెచ్చరించడం ఏమిటంటూ మండిపడ్డారు. బీసీలతో పెట్టుకున్న ఎన్నో పార్టీలకు అడ్రస్ కూడా లేకుండా పోయిన విషయాన్ని గుర్తుంచుకోవాలని శంకర్ హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు మాట్లాడుతూ చప్పిడి ప్రభావతి ఎవరో తనకు తెలియదన్నారు. తన పట్ల అనుచితంగా మాట్లాడటం ఆమె విజ్ఞత, సంస్కారానికే వదిలేస్తున్నామన్నారు. 37వ కార్పొరేటర్ ఆరోగ్యం బాగలేకపోతే తాము కష్టపడి అతన్ని గెలిపించామన్నారు. చివరకు వైఎస్సార్ సీపీలో ఉండి టీడీపీ కోవర్టుగా వ్యవహరిస్తుండటంతో వారిని పట్టించుకోకుండా పార్టీ విజయం కోసం తాము కృషిచేస్తుంటే.. జన్మభూమి కమిటీ మెంబర్ ద్వారా ఉద్రిక్తత సృష్టించారని మండిపడ్డారు. ఇంటికొచ్చి కొడతానంటే చూస్తూ ఊరుకోమని, పుచ్చపగిలిపోద్దని ఘాటుగా హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో తమ సామాజికవర్గం అయిన చేనేతలకు రోజుకో ఆకలి చావు ఉండేదని, కానీ, ఈ ఐదేళ్లలో ఎటువంటి ఆత్మహత్యలు లేవన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు సుతారం శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో 2,600 మంది బుడబుక్కల సామాజికవర్గ ఓటర్లు ఉన్నారని, గోలి తిరుపతిరావును బుడబుక్కలవాడు అనడం ద్వారా మీకు బీసీ కులాలపై ఎటువంటి చిన్నచూపు ఉందో అర్థమవుతుందని అన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు కటారి ప్రసాద్, చావలి శివ, కార్పొరేటర్లు అంబటి ప్రసాదరావు, నాగం వెంకట శేషయ్య, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కుమార్, సేవాదళ్ నగర అధ్యక్షుడు వల్లెపు మురళి, సాంస్కృతిక విభాగం రీజినల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, నాగూరు పాల్గొన్నారు.

దామచర్ల పద్ధతి మార్చుకోవాలి

- దుర్మార్గపు చర్యలకు పాల్పడితే గౌరవం ఉండదు
- ఎమ్మెల్సీ పోతుల సునీత హెచ్చరిక



ఒంగోలు: మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దుర్మార్గపు చర్యలకు పాల్పడితే గౌరవం ఉండదని, అతను తన పద్ధతి మార్చుకోవాలని ఎమ్మెల్సీ పోతుల సునీత హితవు పలికారు. బుధవారం రాత్రి ఒంగోలు నగరంలోని సమతానగర్‌లో జరిగిన ఘటనకు సంబంధించి గురువారం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసి ఆమె చర్చించారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అడిగే హక్కు ఎవరికైనా ఉంటుందన్నారు. అభ్యర్థి, నాయకులు, కార్యకర్తలు ఓట్లు అడగడం కనీస ధర్మమని, ఓటు ఎవరికి వేసుకుంటారనేది ఓటరు ఇష్టమని అన్నారు. అపార్ట్‌మెంట్‌లోకి రావొద్దంటూ ఒక మహిళ అసభ్యపదజాలంతో కనీస గౌరవం కూడా ఇవ్వకుండా హీనాతిహీనంగా మాట్లాడటం సరికాదన్నారు. ఒక అపార్ట్‌మెంట్‌లో ఎంతోమంది ఉంటారని, ఆ అపార్ట్‌మెంట్‌లో ఏ కులం వారు ఉంటారనేది ఎవరికి తెలుస్తుందని ప్రశ్నించారు. ఇప్పటివరకు అనేక డివిజన్లలో ఇంటింటి ప్రచారం జరిగినా ఎక్కడా ఎదురుకాని దుర్మార్గపు ఘటన సమతానగర్‌లో కులాల మధ్య చిచ్చుపెట్టేలా, మతాల మధ్య చిచ్చుపెట్టేలా జరిగిందన్నారు. ఆ విధంగా టీడీపీ నాయకులు వ్యవహరించడాన్ని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలన్నారు. ఎవరి పద్ధతుల్లో వారు ప్రచారం చేసుకోవాలని, ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత దామచర్ల జనార్దన్‌పైనే ఉందని అన్నారు. గత ఎన్నికల సమయంలో ఒంగోలు కమ్మపాలెం ఘటనలో వాసన్నను దారుణంగా విమర్శించినా నేటివరకు ఆయన ఏ ఒక్కరిపైనా కక్షపూరితంగా వ్యవహరించలేదని తెలిపారు. కానీ, నేడు జరిగిన ఘటన కేవలం టీడీపీ స్వార్థ రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. టీడీపీ కార్యకర్తలు మాట్లాడినట్లు ఇతరులు కూడా దూషిస్తే మీరు ఎక్కడ తిరుగుతారని ప్రశ్నించారు. ఇది మంచి పద్ధతి కాదని, దామచర్ల ఇటువంటి విధానాలను మార్చుకోవాలని హితవు పలికారు. ఈ ఘటనపై వాస్తవాలు తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లు చంద్రబాబు మాట్లాడటం సరికాదన్నారు. చంద్రబాబుకు నైతిక విలువలు లేవన్నారు. వలంటీర్లను దుర్భాషలాడటం మొదలు.. చివరకు వాళ్లపై అక్కసు ప్రదర్శించడం, ప్రజలకు సేవ కోసం వచ్చిన వారిని టెర్రరిస్టులు అంటూ విమర్శించడం, మళ్లీ నేడు వలంటీర్ల జీతం రూ.10 వేలు చేస్తామంటూ ప్రకటించడాన్ని గమనిస్తున్న ప్రజలు చంద్రబాబు మాటలను నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్సీ పోతుల సునీత విమర్శించారు.

న్యూస్‌రీల్

యాదవుల సదస్సును విజయవంతం చేయాలి

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్ యాదవ్ పిలుపు



ఒంగోలు: స్థానిక గోపాల్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించే యాదవుల ఆత్మీయ సదస్సును యాదవులంతా పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్ యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక గోపాల్‌నగర్ తిరుపతమ్మ గుడి లైన్‌లో సదస్సు నిర్వహించే ప్రాంతంలో యాదవుల ఆత్మీయ సదస్సు కమిటీ సభ్యులతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2019 ఫిబ్రవరి 3న ఇదే స్థలంలో యాదవుల ఆత్మీయ సదస్సు నిర్వహించినట్లు శంకర్ తెలిపారు. ఆ సందర్భంగా ఏడు విజ్ఞప్తులు చేయగా, వాటన్నింటినీ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పరిష్కరించారన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రెండు అసెంబ్లీ సీట్ల కేటాయింపు, పెద్ద ఎత్తున నామినేటెడ్ పదవులు, యాదవ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా యాదవ సామాజికవర్గంలోని పేదలకు ఆర్థిక చేయూత, ఒంగోలు నగరపాలక సంస్థ ఎన్నికల్లో యాదవులకు 9 సీట్లు కేటాయించి 8 సీట్లను గెలిపించుకోవడం, యాదవ భవన్‌కు సంబంధించి రూ.12 కోట్ల విలువైన 70 సెంట్ల స్థలం కేటాయించడం, కాటంరాజు విగ్రహానికి అనుమతులు ఇప్పించడం, గోపాల్‌నగర్ ప్రారంభంలో ఉన్న శ్రీకృష్ణుడి గుడి అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించడం వంటి అన్ని కార్యక్రమాలను బాలినేని పూర్తిచేశారన్నారు. ఈ నేపథ్యంలో యాదవులంతా సమావేశమై మరికొన్ని సమస్యలు పరిష్కరించుకునేందుకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ ఎంపీ బీదా మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్ యాదవ్, బుర్రా మధుసూదన్‌యాదవ్, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి తదితరులను సదస్సుకు ఆహ్వానించినట్లు తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని సదస్సు ప్రాంతంలో ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి యాదవ కుటుంబం సదస్సుకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు యాదవ్, 6వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ చల్లా తిరుమలరావు, 5వ డివిజన్ నాయకులు ఎండేటి రంగారావు, చావలి శివ, బొమ్మినేని మురళి తదితరులు మాట్లాడగా, యాదవ సామాజికవర్గ ప్రతినిధులు చల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ యనమల నాగరాజు, న్యాయవాది యర్రాకుల శ్రీనివాసరావు, కటారి ప్రసాద్, మోడుబోయిన సురేష్‌యాదవ్, జాజుల శ్రీను, పటాపంజుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలి

ఒంగోలు సబర్బన్: ఎన్నికల సందర్భంగా ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని స్పెషల్ పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా (రిటైర్డ్ ఐపీఎస్)జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన.. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, జిల్లాలోని నోడల్ పోలీస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా నైసర్గిక స్వరూపం, భౌగోళిక విస్తీర్ణం, సరిహద్దులు, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలు, మండలాలు, పోలింగ్ లొకేషన్లు, పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన అన్ని అంశాలపై సమచారాన్ని రాబట్టారు. అదేవిధంగా ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తీసుకుంటున్న చర్యలు, విధుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ వివరించారు. ఈవీఎంల తరలింపునకు సంబంధించిన అంశాలను కూడా వివరించారు. స్పెషల్ పోలీస్ అబ్జర్వర్‌తో పాటు శాంతిభద్రతల అడిషనల్ డీజీపీ శంఖబ్రత బాగ్చీ కూడా వచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, పోలీస్ నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



డీఆర్‌డీఏ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పీడీ వసుంధర



ఒంగోలులో నివాళులర్పిస్తున్న డీఆర్‌ఓ శ్రీలత, బీసీ సంక్షేమాధికారి అంజల



టంగుటూరులో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పార్టీ నేతలు

బడుగుల ఆశాజ్యోతి పూలే

ఒంగోలు/ఒంగోలు సెంట్రల్/చీమకుర్తి/టంగుటూరు: సమాజంలో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నతుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కొనియాడారు. గురువారం పూలే జయంతిని ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి, వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే స్ఫూర్తితో సమాజంలో పేదరికాన్ని రూపుమాపేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, బీసీ సెల్ జిల్లా, నగర అధ్యక్షులు గోలి తిరుపతిరావు, సుతారం శ్రీనివాసులు, చాత్తాద శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ పి.మనోజ్‌కుమార్, మాతాశిశు వైద్యశాల డైరెక్టర్ సాధం విజయలక్ష్మి, సేవాదళ్ నగర అధ్యక్షుడు వల్లెపు మురళి, ఏపీ టైలర్స్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షేక్ మస్తాన్‌బీ, ఒనుడా చైర్మన్ సింగరాజు మీనాకుమారి, రాయని వెంకట్రావు, వడ్డెర సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు, మహిళా విభాగం జోనల్, జిల్లా, నగర అధ్యక్షులు బడుగు ఇందిర, తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, గంటా రామానాయుడు, దామరాజు క్రాంతికుమార్, వాయల మోహన్‌రావు, పటాపంజుల అశోక్, పులుగు అక్కిరెడ్డి, మట్టే రాఘవ తదితరులు పాల్గొన్నారు.

☛ టంగుటూరులోని బొమ్మల సెంటర్‌లో పూలే విగ్రహానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

☛ చీమకుర్తిలో పోలీస్ స్టేషన్ వద్ద పూలే విగ్రహానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, సంతనూతలపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరుగు నాగార్జున పూలమాల వేసి నివాళులర్పించారు.

☛ ఒంగోలు కూరగాయల మార్కెట్ వద్ద పూలే విగ్రహానికి బీసీ సంక్షేమ శాఖాధికారి అంజల, డీఆర్‌ఓ శ్రీలత, ఆర్‌డీఓ సుబ్బారెడ్డి, దివ్యాంగుల సంక్షేమాధికారి అర్చన, ముస్లిం, ఎస్టీ ఇతర సంక్షేమ శాఖాధికారులు నివాళులర్పించి పూలే సేవలను కొనియాడారు. ప్రగతి భవన్‌లో పూలే చిత్రపటానికి డీఆర్‌డీఏ పీడీ వసుంధర నివాళులర్పించారు. సెర్ప్ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు నరేంద్ర కుమార్, దళిత కవి కత్తి కళ్యాణ్, డీపీఎం నరసింహారావు, జేడీఎం రజనీకాంత్, బ్యాంకు లింకేజ్ డీపీఎం బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి



గోపి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ముండ్లమూరు: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం ముండ్లమూరు మండలంలోని పూరిమెట్లలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చొప్పరపు గోపి(19) మట్టి తోలేందుకు చెరువు వద్దకు వెళ్తుండగా మార్గమధ్యంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గోపి అక్కడికక్కడే మృతి చెందాడు. చేతికందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు చొప్పరపు ముసలయ్య, లక్ష్మి, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. గోపి మృతి వార్త తెలియడంతో వైఎస్సార్ సీపీ దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వెళ్లి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

● రూ.2 లక్షల ఆస్తి నష్టం

ముండ్లమూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన గురువారం ముండ్లమూరు మండలంలోని పసుపుగల్లులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కీర్తి వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులు పొలంలో పనులకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఇంటి యజమానికి వచ్చేసరికి ఫ్రిజ్, టీవీ, గ్రైండర్, నాలుగు ఫ్యాన్లు, కూలీల కోసం తెచ్చి ఉంచిన రూ.70 వేల నగదు, దుస్తులు, ఇతర సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి పరామర్శించారు. అధైర్య పడొద్దని, ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

గిద్దలూరులో భారీ చోరీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొప్పువారి వీధిలోని ఓ నివాసంలో దుండగులు చోరీకి పాల్పడిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుడు సూర రామచంద్రరావు కథనం మేరకు.. గత నెల 24వ తేదీన తన సోదరుడు సంజీవరాయుడుపేటలో మరణించగా కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఇంటికి చాలా రోజులుగా తాళాలు వేసి ఉండటాన్ని గమనించిన దుండగులు రెక్కీ నిర్వహించి చోరీకి పాల్పడినట్లు భావిస్తున్నారు. ఇంటి ప్రధాన ద్వారం తలుపులతోపాటు బీరువాను బద్దలుకొట్టిన దుండగులు బ్రాస్‌లెట్, మూడు ఉంగరాలు, నెక్లెస్ సహా మొత్తం 9 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి వస్తువులు, రూ.20 వేల నగదు అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. క్లూస్ టీమ్ సిబ్బంది సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వైవీ సోమయ్య తెలిపారు.

టీడీపీ ప్రచారంలో అంగన్‌వాడీ టీచర్



టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మీతో కలిసి ప్రచారం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ పద్మ

దర్శి: మండలంలోని బండి వెలిగండ్ల గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ పి.పద్మ ఎన్నికల కోడ్ ఉల్లంఘించింది. దర్శి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మీతో కలిసి వెలిగండ్లలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంది. ఐసీడీఎస్, ఎన్నికల అధికారులు స్పందించి అంగన్‌వాడీ టీచర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు డిమాండ్ చేశారు.

బురద రాజకీయాలే కూటమి ధ్యేయం

- వలంటీర్లను దూషిస్తున్న నోటితోనే రూ.10 వేలిస్తామంటారా?
- రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కొండపి ప్రజలకు స్వామి చేసిందేమీ లేదు
- మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ధ్వజం
- ఒక్క అవకాశమిస్తే కొండపి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ
- టంగుటూరు మండలంలోని ఐదు గ్రామాల్లో పల్లెపల్లెకు సిద్ధం, మాటా–మంత్రి కార్యక్రమం



జమ్ములపాలెంలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

టంగుటూరు: ఐదేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరిస్తూ ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగుతుంటే.. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి మాత్రం బురద రాజకీయాలు చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ధ్వజమెత్తారు. కులాల కుంపట్లు రాజేస్తూ, దాడులకు తెగబడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఎన్నికల్లో లబ్ధి పొందాలని కూటమి నాయకులు కుటిల యత్నాలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. గురువారం టంగుటూరు మండలంలోని మల్లవరప్పాడు, వల్లూరు, సూరారెడ్డిపాలెం, జమ్ములపాలెం, వాసేపల్లిపాడు గ్రామాల్లో పల్లె పల్లెకు సురేష్ అన్న సిద్ధం, మాట–మంత్రి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే తమ అభిమతమని, రాజకీయాలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందించామని పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు బురదజల్లడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఓ వైపు వలంటీర్ల సేవలను కించపరుస్తూ, బెదిరింపులకు దిగుతున్న చంద్రబాబు, పచ్చ నేతలు అదే నోటితో రూ.10 వేలు ఇస్తానంటే నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరన్నారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించిన కొండపి ప్రజలకు స్వామి చేసిందేమీ లేదని విమర్శించారు. పేదలకు దక్కాల్సిన పథకాల సొమ్ము రూ.కోట్ల రూపాయలు దోపిడీ చేశాడని ధ్వజమెత్తారు. ఇసుక మాఫియా, కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకుని కొండపిని అధోగతిపాలు చేశారని నిప్పులు చెరిగారు. సంక్షేమ పాలన కొనసాగేందుకు వైఎస్సార్ సీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, జెడ్పీటీసీ మన్నం అరుణకుమారి, సొసైటీ అధ్యక్షుడు రావూరి ప్రవీణ్‌కుమార్, నాయకులు సూదనగుంట శ్రీహరిరావు, సూదనగుంట నారాయణరావు, ఉప సర్పంచి సూదనగుంట కిషోర్, వాసేపల్లిపాడు సర్పంచి నీలి సుబ్బారావు, దావులూరి సునీల్, కవదకంట్ల వెంకీ, ఉప సర్పంచి చవ్వల రామారావు, మద్దులూరి శివాజీ, పాగర్తి గోపి, కుందం హనుమారెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి ననగర కోటి, సర్పంచి వల్లూరి పద్మ, ఎంపీటీసీ యలసిరి సత్యవేణి, కుందం శ్రీనివాసరెడ్డి, వి.మధు, వి.త్రిలోక్, ఇస్రాయేల్, డి.వెంకట్రావు, వి. ఆశీర్వాదం, కె.శేషు, తక్కెలపాటి సుధాకర్, నర్రా శ్రీనివాసులు, కొమ్ము బాబురావు, మెత్తాల వెంకటేశ్వర్లు, కొమ్ము కృపానందం, చాట్ల సురేషు, మెత్తాళ శ్యామ్, అల్లం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



సూరారెడ్డిపాలెంలో పార్టీ నాయకులతో మంత్రి సురేష్

చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం

● సీఈఓ ముఖేష్ కుమార్ మీనా



గుండ్లాపల్లి చెక్‌పోస్టు వద్ద అధికారులతో మాట్లాడుతున్న సీఈఓ ముఖేష్‌కుమార్‌మీనా, పక్కన కలెక్టర్, ఎస్పీ తదితరులు

మద్దిపాడు: చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. గురువారం జిల్లా సరిహద్దులోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో వాహనాల తనిఖీ, వీడియో రికార్డింగ్ చేస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు సీజ్ చేసిన నగదు, వస్తువుల రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. అనుమానాస్పదంగా ఉండే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మహిళా ప్రయాణికుల బ్యాగుల తనిఖీకి మహిళా సిబ్బందినే వినియోగించాలని స్పష్టం చేశారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, స్థానిక తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ శ్రీహరి, రెవెన్యూ, చెక్‌పోస్టు సిబ్బంది ఉన్నారు.

సంక్షేమ లబ్ధిదారులే నా సైన్యం



ఎన్నికల ప్రచారంలో భాగంగా దుకాణంలో టీ కాస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

● ఎన్నికల ప్రచారంలో మంత్రి మేరుగు నాగార్జున


చీమకుర్తి రూరల్: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని, సంక్షేమ లబ్ధిదారులే తమ స్టార్ క్యాంపెయినర్లని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, సంతనూతలపాడు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మేరుగు నాగార్జున పేర్కొన్నారు. 'గడప గడపకు మన నాగార్జున అన్న' కార్యక్రమంలో భాగంగా చీమకుర్తి పట్టణంలోని 9, 10వ వార్డుల్లో మంత్రి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ముందుగా స్థానిక ఆంజనేయ స్వామి గుడిలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మేరుగు చందన్ నాగ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, చీమకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ గోపవరపు రాజ్యలక్ష్మి పూర్ణచంద్రరావు, వైస్ చైర్మన్లు, 9వ వార్డు కౌన్సిలర్ బడే పద్మ అయ్యప్పరెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా టీడీపీ నేతల 'కోడ్' ఉల్లంఘన




తూర్పునాయుడుపాలెంలో స్తంభానికి పసుపు ఎల్‌ఈడీ వైరు

టంగుటూరు: కొండపి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారు. ఆ పార్టీ కొండపి ఎమ్మెల్యే అభ్యర్థి డీబీవీ స్వామి సహకారంతో ఆ పార్టీ నాయకులు మరింత రెచ్చిపోతున్నారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో గ్రామ నడిబొడ్డున వీధి దీపాల స్తంభానికి పసుపు రంగు లైట్లు అలాగే ఉంచారు. కాకుటూరివారిపాలెం గ్రామంలో వాటర్ ప్లాంట్‌కు పసుపు రంగు, ఎన్టీఆర్ పేరు తొలగించలేదు. ఇదే గ్రామంలో టీడీపీ కార్యాలయానికి నూతనంగా పసుపు రంగు వేశారు. రంగు తొలగించాలని టీడీపీ సానుభూతిపరురాలైన సర్పంచ్‌ను అడిగేందుకు స్థానిక అధికారులు వెనుకడుగేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఎన్నికల అధికారులు స్పందించి టీడీపీ నేతల కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కాకుటూరివారిపాలెంలో టీడీపీ కార్యాలయానికి పచ్చ రంగు



కాకుటూరివారిపాలెంలో వాటర్ ప్లాంట్‌కు పసుపు రంగు

సంక్షేమాన్ని మెచ్చి.. జగన్ పాలన నచ్చి..



దర్శిలో టీడీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



వైఎస్సార్ సీపీలో చేరే వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- దర్శి 5వ వార్డుకు చెందిన 250 మంది బూచేపల్లి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిక
- రాచర్ల మండలం కాలువపల్లెలో కేపీ సమక్షంలో చేరిన 30 'ముత్తుముల' కుటుంబాలు

దర్శి/రాచర్ల: వైఎస్సార్ సీపీలోకి వలసలు ఊపందుకున్నాయి. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన నచ్చి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు టీడీపీ సానుభూతిపరులు పేర్కొంటున్నారు. గురువారం దర్శి 5వ వార్డుకు చెందిన టీడీపీ నేత గర్నెపూడి అనిల్‌కుమార్(సన్నీ) ఆధ్వర్యంలో 50 కుటుంబాలకు చెందిన 250 మంది టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని పార్టీలో చేరిన వారికి బూచేపల్లి భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో వీర్ల అంకమ్మ, ఎస్కే మస్తానమ్మ, యర్రగుంట్ల దేవమ్మ, చల్లా దుర్గ, వై.ప్రమీల, కుంచాల రమణమ్మ, ముగ్గు అంకమ్మ, గర్నెపూడి వినోద్‌కుమార్, గర్నెపూడి సునీల్, ఇత్తడి భూపాల్, పి.వీరాంజి, బత్తుల అంకమ్మ, కుంచాల రమణమ్మ, టీ మల్లేశ్వరి, బి.అనీషా,ఉప్పు సామ్యేల్, ఓర్సు సుబ్బమ్మ, గురవమ్మ, మంజు, లలిత, సరిత, లావణ్య, ఖాసింబీ, శంకర్ అంజలి, భూలక్ష్మి ఉన్నారు.

కేపీ సమక్షంలో 30 'ముత్తుముల' కుటుంబాలు

రాచర్ల మండలంలోని కాలువపల్లె గ్రామంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. గురువారం కాలువపల్లె వైస్ సర్పంచ్ ముత్తుముల రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముత్తుముల జగన్నాథరెడ్డి, ముత్తుముల రాజశేఖర్‌రెడ్డి, ముత్తుముల రమణారెడ్డి, ముత్తుముల ప్రతాప్‌రెడ్డి, ముత్తుముల వెంకటరామిరెడ్డి, వేల్పుల పోలురాజు, గాలయ్య, చిన్నరాజయ్య, రామలక్ష్మమ్మ, అంజనేయులు, రామయ్య, బుడమరెడ్డి, ముత్తుముల రాఘవరెడ్డి, బోగాని వీరాంజనేయులు, ఎర్రగొల్ల నందయ్య, దేరంగులు వెంకటేశ్వర్లు సహా 30 కుటుంబాలకు చెందిన వారు గిద్దలూరు అభ్యర్థి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, కాలువపల్లె సర్పంచ్ మీనిగ నారాయణమ్మ, జెడ్పీటీసీ పగడాల దేవి, శ్రీరంగం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, ఆకవీడు మాజీ సర్పంచ్ సూర పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

రచ్చకెక్కిన 'ఫేస్‌బుక్ ప్రేమ'



యువకుడితో మాట్లాడుతున్న పోలీసులు

పాదిలి: ఫేస్‌బుక్ ప్రేమాయణం బజారున పడి, ఘర్షణకు దారి తీసింది. వివరాల్లోకి వెళ్తే.. కొనకనమిట్ల మండలం ఉమ్మడి వెలిగండ్ల గ్రామానికి చెందిన యువకుడికి నంద్యాల పట్టణానికి చెందిన యువతితో ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడింది. వారి మధ్య స్నేహం ఒకరిని విడిచి ఒకరు ఉండలేనంత స్థాయికి చేరింది. ఈ క్రమంలో ఆ యువతి తల్లిదండ్రులను వదిలి వెలిగండ్లలో ప్రియుడితో కలిసి సహజీవనం చేసింది. తాగుడుకు బానిసైన ఆ యువకుడు తరచూ వేధిస్తుండటంతో నంద్యాల వెళ్లడం కోసం గురువారం పాదిలి బస్టాండ్‌కు చేరుకుంది. విషయం తెలుసుకున్న ప్రియుడు బస్టాండ్ వద్ద యువతితో వాగ్వాదానికి దిగాడు. ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎవరి ఇళ్లకు వారిని పంపారు.